క్లుప్తంగా

సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా అశోక్‌కుమార్



సత్తెనపల్లి: సాధారణ బదిలీల్లో భాగంగా సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా బి.అశోక్ కుమార్ రానున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న దేవానంద్ బదిలీపై దుగ్గిరాల వెళుతున్నారు. గురజాల సబ్ రిజిస్ట్రార్‌గా అశోక్‌కుమార్ పనిచేస్తున్నారు. సత్తెనపల్లి సీనియర్ అసిస్టెంట్‌గా గురజాల నుంచి పద్మావతి రానున్నారు. ఇంకా పలువురు సిబ్బంది బదిలీల పై వెళ్లనున్నారు.

రేపు చేపల పెంపకానికి బహిరంగ వేలం

ముప్పాళ్ళ: మండల కేంద్రంలోని చెరువులో చేపల పెంపకానికి బుధవారం బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి ఆర్.నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ వేలంలో పాల్గొనదలచినవారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ డిపాజిట్‌ను మంగళవారం పంచాయతీ కార్యాలయంలో చెల్లించి, పేరు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ధరగా రూ.35వేలు నిర్ణయించినట్లు తెలిపారు.

సత్తెనపల్లి ఎంపీడీఓగా శ్రీనివాసరెడ్డి



బండి శ్రీనివాసరెడ్డి



పీజే విలియమ్స్

సత్తెనపల్లి: సత్తెనపల్లి ఎంపీడీవోగా బండి శ్రీనివాసరెడ్డి బదిలీపై రానున్నారు. ఆయన ప్రస్తుతం నకరికల్లు ఎంపీడీవోగా పని చేస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా నియోజక వర్గంలోని నాలుగు మండలాల ఎంపీడీవోలను బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. సత్తెనపల్లి ఎంపీడీవోగా పనిచేస్తున్న జీవి సత్య నారాయణను రాజుపాలెం మండలానికి బదిలీ చేశారు. నకరికల్లు మండలానికి పిడుగురాళ్ల ఎంపీడీవో జి.కాశయ్య రానున్నారు. ముప్పాళ్ల ఎంపీడీవో పుట్టా రెడ్డిని దుర్గి మండలానికి బదిలీ చేశారు. మంగళగిరి ఎంపీడీవో పీజే విలియమ్స్ ముప్పాళ్ల మండలానికి రానున్నారు. గతంలో ముప్పాళ్ళ, సత్తెనపల్లి ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. వీరంతా ఒకటి, రెండు రోజుల్లో రిలీవై ఆయా మండలాల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇదిలా ఉంటే సత్తెనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఏవో బసవకుమారితో పాటు జూనియర్ అసిస్టెంట్, టైపిస్టులకు బదిలీలు రానున్నట్లు సమాచారం.

నేడు 'పొలం పిలుస్తోంది'

ముప్పాళ్ళ: మండలంలోని చాగంటివారిపాలెం, లంకెలకూరపాడు గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరుగుతుందని మండల వ్యవసాయశాఖాధికారి ఎమ్.అరుణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొని, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, సేంద్రియ వ్యవసాయం, సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

విద్యార్థినుల సమస్యల పరిష్కారానికి కృషి

రాజుపాలెం: మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను సత్తెనపల్లి ఆర్డీవో మురళీకృష్ణ సోమవారం తనిఖీ చేశారు. ఇంటర్మీడియెట్ విద్యార్థినులు తరగతి గదుల నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. వర్షం వచ్చినప్పుడు 9వ, 10వ తరగతి గదులు ఉరుస్తున్నాయన్నారు. సమస్యను త్వరలో పరిష్కరిస్తానన్నారు. ప్రతి వారం తహసీల్దారును కేజీబీవీ పరిశీలనకు పంపిస్తామని తెలిపారు. సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

పెదకూరపాడు స్టేషన్‌లో రైళ్ల హాల్ట్‌కి వినతి

పెదకూరపాడు: పెదకూరపాడు రైల్వే స్టేషన్‌లో రేపల్లె-సికింద్రాబాద్ ఫాస్ట్ పాసింజర్, పల్నాడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని మూడువేల ప్రజల సంతకాలతో స్థానిక సంస్థల తీర్మానాలతో కూడిన వినతి పత్రాన్ని నరసరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణ దేవరాయలుకు, గుంటూరు రైల్వే డివిజినల్ మేనేజర్ రామకృష్ణకు పెద్దకూరపాడు, పరిసర గ్రామాలకు చెందిన నాయకులు సోమవారం అందజేశారు. గుంటూరులో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలును ఆయన నివాసంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఎంపీ స్పందించి అక్టోబరు 4న విజయవాడలో రైల్వే డివిజన్ సమావేశం జరుగుతుందని, ఈ విషయం చర్చకు వచ్చేలా చూస్తానన్నారు. హాల్టు కోసం కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు అభ్యుదయ రచయితల సంఘం కార్యదర్శి కె. శరచ్చంద్ర జ్యోతిశ్రీ, ప్రజా కవి, జిల్లా రైతుసంఘం సహాయ కార్యదర్శి దర్శి శేషారావు, ఏపీ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ నాయకుడు నిమ్మరాజు చలపతిరావు, పెద్దకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా !

సత్తెనపల్లి: నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. నందిగామ జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా ఎంపిక పోటీలు సోమవారంతో ముగిశాయి. అండర్-14, 17 బాలబాలికల అథ్లెటిక్స్, యోగ, చెస్ ఎంపిక పోటీలకు వివిధ పాఠశాలల నుంచి 320 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కో-ఆర్డినేటర్ లాకు పిచ్చయ్య నేతృత్వంలో నిర్వ హించారు. నియోజకవర్గ కో-ఆర్డినేటర్ బి.అనిల్ దత్త నాయక్ పర్యవేక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయులు డి.శ్రీనివాసరావు, ఎ. శ్రీరామ్‌రెడ్డి, సీహెచ్ సుధారాణి, డి.చండీప్రియ, శశికళ, శివ గోవర్ధన, చిన్నయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి స్కూల్ గేమ్స్

నార్నెపాడు(ముప్పాళ్ళ): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న మండల స్థాయి ఆటల పోటీలు సోమవారం ముగిశాయి. నార్నెపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పోటీలను ఎంఈఓ-2 సీతారామిరెడ్డి, పాఠశాల హెచ్ఎం రమేష్‌లు పర్యవేక్షించారు. మొత్తం ఏడు రకాల ఆటల పోటీలు జరిగాయి. కబడ్డీ అండర్-14 బాలురు, బాలికల విభాగంలో నార్నెపాడు జెడ్పీ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఖో-ఖో అండర్-17 బాలురు విభాగంలో మాదల జెడ్పీ పాఠశాల జట్టు, అండర్-14 విభాగంలో నార్నెపాడు జట్టు విజేతలుగా నిలిచాయి. వాలీబాల్ లో అండర్-14 విభాగంలో ముప్పాళ్ల జెడ్పీ పాఠశాల జట్టు విజేతగా నిలిచింది. చెస్‌లో అండర్-14 బాలురు, బాలికల విభాగంలో నార్నెపాడు విద్యార్థులు గెలుపొందారు. వీటితో పాటుగా అథ్లెటిక్స్ జరిగాయి. ఆయా పోటీల్లో విజేతలు సత్తెనపల్లిలో జరిగే నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని మండల కో-ఆర్డినేటర్ జి.నరసింహారావు తెలిపారు.. పోటీలకు న్యాయనిర్ణేతలుగా పీడీలు ఎస్ఎం సుభాని, సత్యవతి, పీఈటీ రాణి వ్యవహరించారు.



పరుగు పందెంలో..



మెలికలు తిరిగే యోగా



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు



హై జంప్‌లో క్రీడాకారుడు

లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి



నిరసన తెలుపుతున్న కార్యకర్తలు, కార్మికులు

పెదకూరపాడు: కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా, కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నియోజవర్గ సీపీఐ కార్యదర్శి, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు మునగోటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నియోజవర్గ కేంద్రమైన పెద్దకూరపాడులో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు . శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాల పిలుపు మేరకు సోమవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. రూ.26 వేలు వేతనం, ఉద్యోగ భద్రత, రైతుకు గిట్టుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొండలు, రాజారత్నం, అనిల్ , రత్నం, సుధాకర్ది, కోటి పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ కొనసాగించాలి



చిలకలూరిపేట: వలంటీర్ వ్యవస్థను యధాతథంగా కొనసాగించాలని అఖిలభారత యువజన సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సుభాని కోరారు. వలంటీర్ వ్యవస్థ కొనసాగించాలని కోరుతూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం పురపాలక సంఘానికి చేరుకొని మున్సిపల్ మేనేజర్ నగీనా సుల్తానాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీగా వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, వారి వేతనాన్ని రూ. 5 వేల నుంచి రూ. 10 వేలకు పెంచుతామని ప్రకటించిన విషయం గుర్తు చేశారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు గడిచినప్పటికీ వలంటీర్ వ్యవస్థపై స్పష్టత ఇవ్వకపోవడం ఆందోళన కరమన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే వలంటీర్ వ్యవస్థ ఎంతో అవసరమన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వలంటీర్లకు జీతాలు చెల్లించటం లేదని, వారి పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతాలు అందక రాష్ట్ర వ్యాప్తంగా 2.50 లక్షల మంది వలంటీర్లు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, వలంటీర్లు వెంకటేష్, షఫీనా, పోలేశ్వరి, మరియమ్మ, శివానాయక్, నసిరుద్దిన్, మౌనిక, రాజ్య లక్ష్మి, మన్సూర్, జిలాని పాల్గొన్నారు.

క్విజ్ విజేతలను అభినందించిన కలెక్టర్

నరసరావుపేట: రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలలో ద్వితీయస్థానం పొందిన శంకర భారతీపురం విద్యార్థులు బి.శ్రావణి (8వ తరగతి) జి.నాగశ్రీ (9వ తరగతి)లను జిల్లా కలెక్టర్ బి.అరుణ్‌కుమార్, జేసీ సూరజ్ గనోరేలు అభినందించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులతో కలిసి కలెక్టర్‌ను కలిశారు. వారిని అభినందిస్తూ జీవితంలో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కోసం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ యూత్ ఫెస్ట్‌లో భాగంగా తాడేపల్లిలోని కేఎల్ యూనివర్శిటీలో గత బుధవారం 18వ తేదీన క్విజ్‌పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా తరపున వీరిద్దరూ హాజరై విజేతలుగా నిల్చారు. వీరికి శంకర భారతీపురం స్కూలు బయాలజీ సైన్స్ టీచర్ సూరిబాబు మార్గదర్శకులుగా వ్యవహరించారు. వీరిని త్వరలో నేషనల్ క్విజ్ కాంపిటీషన్స్‌లో పాల్గొనేందుకు పంపడం జరుగుతుందని ఏపీ శాక్స్ అధికారులు తెలిపారు.



మాచర్ల-గుంటూరు రహదారికి అడ్డంగా పడిపోయిన చింత చెట్టు

చింతన చేయాల్సిన పెద్ద విషయమే

మండలంలోని మాచర్ల-గుంటూరు రహదారికి కొండమోడు సమీపంలో దర్గా వద్ద ఉన్న చింత చెట్టు రోడ్డుపై సోమవారం కూలిపోయింది. ఆదివారం సాయంత్రం మొదలలో నిప్పు పెట్టడంతో రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అయ్యింది. పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని చెట్టును తొలగించి, ట్రాఫిక్ క్లియర్ చేశారు. మాచర్ల- గుంటూరు రహదారికి ఇరువైపులా వందేళ్లకు పైనే చింత చెట్లు నాటారు. ఇప్పుడు వాటి కలపను విక్రయించేందుకు ఇలాంటి దారుణాలకు కొందరు దుండగులు పాల్పడుతున్నారు. పిడుగురాళ్ల, సత్తెనపల్లి అడితీలకు చెందిన నిర్వాహకులు వందల సంఖ్యలో వేప చెట్లను నరుకుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నిప్పు పెట్టినవారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – రాజుపాలెం

నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలి

- ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కోటేశ్వరమ్మ
- జాబ్ మేళాలో ఉద్యోగాలకు 41 మంది ఎంపిక



జాబ్ మేళాలో మాట్లాడుతున్న కోటేశ్వరమ్మ

సత్తెనపల్లి: యువత ఉన్నత శిఖరాలను అందుకునే విధంగా నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ యు.కోటేశ్వరమ్మ అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ), ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ అధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. నియామక పత్రాలు అందుకున్న వారిని అభినందించారు. సత్తెనపల్లి నియోజకవర్గ పరిసర ప్రాంతాల యువత 112 మంది జాబ్ మేళాకు హాజరయ్యారు. జాబ్ మేళాలో ఐల అగ్రి సర్వీసెస్, బీజెడ్ ఫిన్సర్వ్, రిలయన్స్ రిటైల్, శ్రీ విజయ బయో ఫర్టిలైజర్ నాలుగు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన 41 మందికి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు నియామక పత్రాలు అందించారు. జిల్లా ప్లేస్మెంట్ అధికారి ఎం.రవీంద్ర నాయక్, సత్తెనపల్లి స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ ఇ.రామకృష్ణ రెడ్డి, బి.అంజిరెడ్డి, కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు, జిల్లా యంగ్ ప్రొఫెషనల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అడవుల్లో చెట్లు నరికితే కఠిన చర్యలు

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విజయకుమారి



బెల్లంకొండ: అడవులలో చెట్లను నరికి వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విజయకుమారి తెలిపారు. సోమవారం మండలంలోని పాపాయపాలెం సెక్షన్ పరిధిలోని వెంకటాయపాలెం, మన్నెసుల్తాన్‌పాలెం అటవీ శాఖ బీట్‌లను పరిశీలించారు. అటవీ ప్రాంతాలలో చెట్లను నరకివేస్తూ, చదును చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. అటవీ జంతువులను వేటాడేందుకు ఉచ్చులు అమర్చే వారిపై తమ సిబ్బంది నిఘా ఎప్పుడూ ఉంటుందన్నారు. అటవీ ప్రాంతాల్లో గుప్తనిధులు, వజ్రాలు దొరుకుతాయన్న మాటలను ఎవరూ నమ్మవద్దని, అవి అపోహలు మాత్రమేనని తెలిపారు. వజ్రాల వేట కోసం వస్తే ఇక నుంచి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆమె వెంట డీఆర్వోలు ప్రకాశరావు, ఎఫ్‌బీవోలు వెంకట్రావు, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారు

– ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



నకరికల్లు: గడచిన వంద రోజుల పాలనలో ప్రజలు సంతృప్తిగా ఉన్నారంటూ సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని చాగల్లు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సీసీ డ్రెయిన్స్‌కు శంకుస్థాపన చేసి, స్వర్ణాంధ్ర 2047 బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా చేపడుతూ రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నామన్నారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, నాయకులు నాగోతు శౌరయ్య పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిశీలన



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాధాకృష్ణ, నాయకులు

సత్తెనపల్లి: క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను పరిశీలన చేసి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై రాధాకృష్ణ పిలుపునిచ్చారు. కొత్తపేటలో సోమవారం జరిగిన 20వ వార్డు సీపీఎం శాఖ మహా సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహాసభకు పార్టీ నేత మామిడి తాతారావు అధ్యక్షత వహించారు. రాధాకృష్ణ మాట్లాడుతూ శాఖ పరిధిలో 19, 20, 21 వార్డుల స్మశాన వాటికకు వెళ్లే దారిలో ఉన్న వాగుపై బ్రిడ్జిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ముందుగా సీపీఎం జెండాను మామిడి తాతారావు ఆవిష్కరించారు. ఇటీవల మరణించిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గత మూడు సంవత్సరాల కార్యకలాపాల కార్యదర్శి నివేదికను శాఖ కార్యదర్శి అనుముల వీరబ్రహ్మం ప్రవేశపెట్టారు. శాఖ సభ్యులందరూ చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. నూతన కార్యదర్శిగా అనుముల వీరబ్రహ్మంను తిరిగి ఎన్నుకున్నారు. పరిశీలకులుగా పట్టణ కార్యదర్శి డి.విమల, పట్టణ కమిటీ సభ్యులు ఎం.జగన్నాథరావు వ్యవహరించారు. శాఖ సభ్యులు ఎం.సైదమ్మ, ఎ.రామయ్య, కె.చంద్రశేఖర్, ఎం.ఆదినారాయణ, ఎ.శౌరీ పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే ఆరోగ్య సమాజం



సత్తెనపల్లి: పట్టణం స్వచ్ఛంగా ఉంటే ఆరోగ్య సమాజం సాధ్యమవుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి అన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరంలో 150 మంది పారిశుద్ధ్య కార్మికులకు అన్ని రకాల పరీక్షలు చేసి, ఉచితంగా వైద్యులు మందులు పంపిణీ చేశారు. ఏరియా వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, మేరిగ్రేస్, నాగేశ్వరరావు, జాన్‌బాబు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యం కాపాడుకోవాలి



కార్మికులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

పెదకూరపాడు: పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉండాలని, ప్రజలకు వారు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్ బాబు అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించి పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య భద్రత కొరకు సోమవారం సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సఫాయి సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విద్యతో కలసి ప్రారంభించారు. సుధాకర్ బాబు మాట్లాడుతూ కరోనా సమయంలో పారిశుద్ధ్య కార్మికులు ప్రాణాలకు తెగించి సేవలందించారన్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. 51 మంది కార్మికులకు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చైతన్య, కాటూరి వైద్యశాల వైద్యులు కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. పెదకూరపాడు, అమరావతి, మండలాల బీజేపీ అధ్యక్షులు మేకల వెంకటేశ్వర్లు, పమిడాల శ్రీనివాసు, అమరావతి ఉపాధ్యక్షుడు మేకల రామారావు, యువ మోర్చా అధ్యక్షుడు సికా ప్రవీణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వం మద్దతివ్వండి

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



స్టిక్కర్స్ అంటిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

అచ్చంపేట: కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే ఎన్నో మంచి పనులు చేసిందని, ఇది ఖచ్చితంగా మంచి ప్రభుత్వమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా మండలంలోని వేల్పూరు, చింతపల్లి గ్రామాలలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. బీసీ, ఎస్సీ కాలనీలలో కరపత్రాలు పంపిణీ చేసి, తలుపులపై ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పొన్నెకంటి మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్, ఎంపీడీఓ శివసుబ్రమణ్యం, పంచాయతీ కార్యదరులు పాల్గొన్నారు.

సీజీజీ బ్యాంకు బ్రాంచ్ ముట్టడి


- తాళాలు వేసిన బాధిత ఖాతాదారులు
- బ్యాంకులో కుదవ బంగారం మాయం
- 14 నెలలుగా నష్ట పరిహారం ఇవ్వకపోవడంతో ఆందోళన



బ్యాంకు వద్ద ఆందోళన చేస్తున్న బాధిత ఖాతాదారులు

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్‌లో బంగారం కోల్పోయిన ఖాతాదారులు సోమవారం ముట్టడి చేపట్టారు. బ్యాంకుకు తాళాలు వేసి, ఆందోళన వ్యక్తం చేశారు. గోల్డ్ లోన్ బాధిత రైతుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కమిటీ కార్యదర్శి టి.హనుమంతరావు మాట్లాడుతూ 14 నెలలుగా దొడ్లేరు సీజీజీబీ నందు బంగారం కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇస్తారని ఎదురు చూడటం జరిగిందన్నారు. ఇప్పటికీ పలుమార్లు బ్యాంకు, పోలీస్ అధికారులను కలిసినప్పటికీ సగం మంది రైతులకి మాత్రమే నష్ట పరిహారం చెల్లించారని చెప్పారు. మిగతా రైతులకు పరిహారం ఎప్పుడు చెల్లిస్తారో తెలియక పోవడంతో బంగారం ఆందోళన చేపట్టినట్లు చెప్పారు. ఈ సందర్భంగా దొడ్లేరు సీజీజీబీ బ్యాంకు మేనేజర్ స్పందిస్తూ.. 500 మంది బాధిత రైతులకు గాను , ఇప్పటి వరకు 270 మంది రైతులకు నష్ట పరిహారం చెల్లించామని తెలిపారు. మరొక 40 మంది రైతులకు నష్ట పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని ఖాతాదారులు తెగేసి చెప్పారు. ఎస్ఐ నాగేంద్రరావు చేరుకుని బాధిత రైతులతో మాట్లాడారు. బ్యాంకు అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పి, రైతులను ఆందోళన విరమించాలని కోరారు. ఎస్ఐ హామీతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో దగ్గు నటరాజు, ఈశ్వరరెడ్డి, షేక్ రవూఫ్, రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీకి ఆశీర్వచనం



డీఎస్పీ హనుమంతరావుకు ఆశీర్వచనం

సత్తెనపల్లి: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావును పట్టణంలోని శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం బాధ్యులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేద పాఠశాల విద్యార్థులు ఆశీర్వచనం చేసి, స్వామి వారి శేష వస్త్రం, చిత్రపటం బహూకరించారు. ఆశ్రమానికి రావాలని బాధ్యులు ఆహ్వానించారు. ఆశ్రమం బాధ్యుడు చింతాడ రమేష్, సూర్యప్రకాష్, అంజనేయశాస్త్రి, సురేష్ ఉన్నారు.